కథా నిలయం
6258
శ్రీకాకుళం

# అనూరాధ

చీకటిగావుంది, అనూరాధ డాబామీద కుర్చీలో చీకట్లో కూర్చుని వెల్తూరూ, చీకటీ మిశ్రమంగావున్న వీధిలోకి చూస్తోంది. వీధిలోకి కనిపించినంత మేరా తనశక్తివంచనలేకుండా ఆమె ఆదుర్దాగా చూస్తోంది.

రోడ్డుమీద జనం ఎక్కువగానడవటల్లేదు. నడుస్తున్న కొద్ది మందినీ ఆమెపరీక్షగా చూస్తూనేవుంది; ఆశాభంగం చెందుతూనే వుంది.

ఆమె మెల్లగాలేచిపిట్టగోడదగ్గరకుపోయినిలబడింది. చప్పునఏదో విషయం గుర్తువచ్చింది. చీకట్లోచిన్నగా నవ్వుకుంది.

"ఇంత చిన్నమనిషిమీద అంతపెద్ద....అంత పెద్దమనిషికి కోపం!"

పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం!

ఆమె యింకా ఏదో ఆలోచించబోతూంది. కాని యింతలోకే క్రిందనుంచి ఏదో శబ్దం వినిపించింది. అలవాటుచేత గబ గబ మెట్లుదిగి వెళ్ళిపోయింది.

పెరటివైపు గదిలో అత్తగారూ, మామగారూ పడుకున్నారు. ఇద్దరూ గాఢనిద్రలో వున్నారు. ఆ గదిదాటి మధ్యగదిలోకి

వెళ్ళింది. వెడుతూనే ఉయ్యాలలో ఏడుస్తూన్న బాబుని తీసి ఎత్తుకుంది.

ఆమె ఎత్తుకున్నా బాబు ఏడుపు మానలేదు. ఇంకా ఏడుస్తున్నాడు. వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. చేతుల్లో నిలవటంలేదు.

వాడలా ఎందుకు ఏడుస్తున్నాడో అనూరాధకి తెలుసు. పాలు పట్టాలి. కాని పాలు కలిపేదాకా వాడిని సముదాయించాలి. ఎవరు సముదాయిస్తారు? అత్తగారు వాడిఏడుపు వింటుందేమోనని ఆమె భయపడింది. ఒకటి రెండు నిముషాలు తటస్థంగావుండి పోయి, చివరికితిరిగి చంటివాడ్నిఉయ్యాలలోనే పడుకోబెట్టి, వాడుఏడుస్తున్నా లెక్కబెట్టకుండా పాలుకలపటంలో నిమగ్నురాలయింది....

"ఎందుకలా ఏడుస్తాడు?"

ఉలుక్కిపడి తలఎత్తి చూసింది. అత్తగారు.

"పాలకోసం అత్తయ్యా."

"ఊఁ" ఆమె మెల్లగా నిట్టూర్చింది. పోయి పిల్లవాడ్ని చేతుల్లోకి తీసుకుంది,

"వాడింకా యింటికి రాలేదు కదూ?"

అనూరాధ తలఎత్తి ఒకసారి ఆమెగారిముఖంలోకి చూసి మళ్ళీ దించుకుంది.

"సరే. రోజూ జరుగుతున్న భాగవతమే...ఇంతకీ నిన్ను నమ్ముకుని నేను మోసపోయాను.

అనూరాధ జవాబివ్వలేదు.

"చదువుకున్నపిల్లవు. చాలా తెలివిగా ప్రవర్తిస్తావనుకున్నాను. కాని...." అని కళ్ళు తుడుచుకుని, కొంచం ఆగి "వాడిని అదుపాజ్ఞల్లో పెట్టటంలో మాలాగే నువ్వూ విఫలురాలివైయ్యావు" అంది గాద్గదికంగా.

అనూరాధ పాలసీసాతో ముందుకువచ్చి "ఇలా యివ్వండత్తయ్యా" అని పిల్లవాడ్ని తీసుకుని ఒకమూలకుపోయి కూర్చుంది. "అత్తగారు ఆ పురాణం యింకా కొనసాగించకుండావుంటే బావుండును" అని ఆమె అనుకుంది.

"ఇలా ఎంతకాలం జరుగుతుందో చూద్దాం. నాకు తెలుసు. యీ తనువిలా అశాంతిగానే చల్లారిపోతుందని."

"మీరుపోయి పడుకోండత్తయ్యా" అని అనూరాధ అంది చిన్నగా.

"నాకు తెలుసు అమ్మాయి. పడుకోవటం అన్నది రోజూవున్నదే. మనుషులు రోజూ పడుకోవాలనికూడా తెలుసు. ఈ విషయం యీవాళ్టికి నీచేత చెప్పించుకోవాల్సివచ్చింది" అని ఆవిడ గొణుక్కుంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

"అమ్మయ్య" అనుకుంది అనూరాధ.

అత్తగారు ఏదో గొణుక్కుంటూవుండటం ఆమెకు చాలాసేపటిదాకా వినిపిస్తూనేవుంది. లేచి, పిల్లాడ్ని ఉయ్యాలలో పడుకోబెట్టింది. తర్వాతపోయి మంచంమీదపడుకుని కళ్ళుమూసుకుంది, తనకి నిద్రరాదు. ఆమెకు తెలుసు. ఈ స్థితిలోవున్న ఏఆడదానికీ నిద్రరాదు.

కొంచంసేపు అటూయిటూ పొర్లింది. ఏవేవో ఆలోచన్లు ఆమెను అలుముకుంటున్నాయి. ఒకటిరెండు నీటిచుక్కలు అనుకోకుండా ఆమె నేత్రాలనుండి స్రవించాయి. కాని వెంటనే తనపనికితనే సిగ్గుపడి కళ్లు తుడుచుకుంది. తనలోవున్న దుర్బలత్వం యిదే. చీటికి మాటికీ అనుకోకుండా ఎందికిలా కన్నీళ్లు కారతాయి?

పెరటివైపుగదినుంచి ఏమీ శబ్దాలు వినిపించటంలేదు. అత్తగారు నిద్రపోయుంటుంది. ఇహ! ఆయన! ముసలాయన! సాధా

ఠణంగా ఆయన ఎప్పుడూ నోరువిప్పి మాట్లాడడు. అమాట్లా దేది కొద్దిగా అయినా అత్తగారితోనే. లేకపోతే మౌనవ్రతం. ఆమె యింకా ఆలోచనలో వుండగానే వీధి తలుపు చప్పు డయింది. చప్పునలేచి, వెళ్ళి తలుపుతీసింది.రామారావు మెల్లగా లోపలికి వచ్చాడు. అతను గుట్టు చప్పుడు కాకుండా లోపలికి పోయి కాళ్ళు కడుక్కునివచ్చి, బట్టలు మార్చుకునేదాకా ఆమె అతన్ని పలకరించలేదు.

"వడ్డించమంటారా?" అప్పుడు అడిగింది.
"ఏమిటి?" అతను ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.
జవాబు ఏం చెప్పాలో తెలీక ఆమె తికమక పడుతూండగానే అతనే మళ్ళీ "యిప్పుడా? ఈ అర్ధరాత్రి. ఏం వద్దులే"అన్నాడు. తర్వాతపోయి మంచంమీద పడుకున్నాడు. అనూరాధ ఒకక్షణం అలాగే నిలబడి, తర్వార తనుకూడా పడుకుంది.

ఆమె మనస్సుకి యీపూట మరీ విశ్రాంతిలేకుండా వుంది. క్షణ క్షణాకీ ఏదోబాధ పడుతూంది. అతన్ని ఏదో అడగాలని అనుకుంటూంది. కాని.... అడగలేదు.

"అనూరాధా!" రామారావు చాలాసేపు తర్వాత మృదువుగా అన్నాడు.

"ఏమిటండీ?"

అతను వెంటనే లేచి ఆమె ప్రక్కకుపోయి కూర్చుని, ఆమె చేతుల్ని తనచేతుల్లోకి తీసుకుంటూ "కోపం వచ్చిందా?" అని అడిగాడు.

అతను ఎంత వారిస్తున్నా ఆమెకూడా కూర్చుంది.
"ఎందుకు?"

"నేను మూర్ఖంగా ప్రవర్తించానా?"

"అదేమిటి?"

"నాకు తెలుసు అనూ. నువ్వెందుకు ఆశ్చర్యపడతావు? నువ్వు చెప్పినవిషయం నేనెందులోనూ కాదనలేదు. కాని యిందులో నువ్వు నన్ను నిర్బంధించకూడదు. నేను మూర్ఖుణ్ణే అనుకో, క్రూరుడ్నే అనుకో. ఏది ఏమయినా నానిశ్చయంమట్టుకు మారదు."

అనూరాధ ఒకనిమిషం మాట్లాడలేదు. "మిమ్మల్ని ఏ విషయం లోనూ నిర్బంధించేదుకు నాకధికారంలేదు. కాని మీరు చాలా చదువుకున్నవారు. ఆ చంటివెధవచేసిన పొరపాటు యిందులో ఏమీలేదు. వాడిమీద మీకెందుకంత కసి?" అని అడిగింది. తర్వాత.

రామారావు ఆమెవంక జవాబుచెప్పకుండా చూసి వూరు కున్నాడు.

తిరిగి ఆమే అంది "నాకుతెలుసు; ఈప్రసక్తి తీసుకువస్తే మీకు ఎంతో కష్టం కలుగుతుందని. ఇలా మాట్లాడుతున్నానని ఏమీ అనుకోకండి. నేను మీకు ఇక కష్టంకలిగించను. ఈవిషయం మీద మన యిద్దరిమధ్యా సంభాషణలు జరగటంకూడా యిదే ఆఖరిరోజు. కాని యీ ఆఖరిరోజున మిమ్మల్ని హృదయపూర్వ కంగా వేడుకుంటున్నాను. మీ మనస్సుమార్చుకోరా?"

అతను నిట్టూర్చి "నా మనస్సుని అదుపాజ్ఞలలో పెట్టుకునే శక్తే నాకుంటే నీవుచెప్పింది పాటించేవాడ్ని" అన్నాడు.

కొంచంచేపు వూరుకుని ఆమె "అయితే నేను పూర్తిగా పరా జయం పొందాను" అంది, చాలా కష్టంమీదమాట పెగుల్చు కుంటూ.

అతను ఆశ్చర్యంగా భార్యవైపు చూసి "నీవు ఎందుకు పరాజయం పొందావు? నన్ను పెళ్ళిచేసుకోవటంలో ప్రధానోద్దేశం అదికాదుగా?" అన్నాడు.

"కాకపోవచ్చు. కాని కాపరానికంటూ యీ యింట్లో అడుగు పెట్టాక మీ పెద్దవాళ్ళు నాకు నియమించిన పని అదే. మామగారు చూపుల్తో నన్ను కల్లోల పరిచారు. అత్తగారు చాటుకు తీసుకువెళ్ళి కన్నీళ్ళతో నన్ను ఎంతో ప్రాధేయపడ్డారు. అప్పట్లో యీ చిన్నవిషయాన్ని అంత కష్టసాధ్యమైనదిగా నేను పరిగణించలేదు" అని గాద్గదికంగా అని "పోనీయండి. ఈ చిన్న విషయాన్నిగురించి మీతో చాలారోజులు వాగ్వివాదాలు పెట్టుకున్నాను. మిమ్మల్ని ప్రాధేయపడ్డాను. మీతో దెబ్బలాడాను. కాని నేను సాధించగలిగిందేమిటి? ఏమీలేదు. ఏమీ లేనిదానికి మీకు బాధకలిగిస్తూ వుండటందేనికి? రేపట్నుంచి కనీసం మిమ్మల్నయినా సంతోషపరుస్తాను" అంది.

"నిన్ను యిలా బాధపెట్టటం నాకూ ఏదో చెప్పరాని యిదిగా వుంది. కాని నీ ఓటమి నాకు ఏమాత్రంకూడా సంతోషం కలగ చెయ్యదని గ్రహించవా?"

అనూరాధ కన్నీళ్ళతో "గ్రహించాను.ఏంచేస్తే మీకు సంతోషం కలుగుతుందో గ్రహించలేకపోవటంమాత్రం నా దురదృష్టం" అంది.

అతను కొంచం ఆలోచించి "నువ్వన్నట్లు రేపట్నుంచి అలా ప్రవర్తిస్తే చాలా శాంతికరమైన వాతావరణం మనయింట్లో సృష్టించ వచ్చునేమో" అన్నాడు.

ఆమె దీనికేమీ జవాబివ్వలేదు...."కాని ఒకవిషయం చెల్లిస్తానని మీరు నాకు మాట యివ్వండి" అంది.

"ఏమిటి?"

"నేను చాలా చిక్కుల్లో యిరుకున్నానన్న విషయం మీకు తెలిసిందే. వాడ్ని చూడటానికి కూడా మీరు యిష్టపడరు. వాడు పుట్టాక యింతవరకూ వాడిమొహంకూడా చూడలేదు. అది వాడి దురదృష్టం. ఆ విషయం అలా వుంచండి. కాని మీ పనుల కేమీ అభ్యంతరం కలగకుండా,మాకేమాత్రం కష్టంకలగకుండా బాబుగాడ్నికూడా సంరక్షణ చేస్తుంటాను. ఈ భారం కేవలం అత్తగారిమీదే నేను వుంచలేను.ఇదిమీకు యిష్టమేగా"

అతను నిట్టూర్చి "అలాగే చెయ్యి" అన్నాడు.

అనూరాధ అంది "ఈరాత్రి మనకింత ప్రసాంతంగా గడుస్తుందనుకోలేదండీ. రోజూ కన్నా యీరోజు మీకు మరీ బాధ కలిగించాను. చిరాకుపడి మీరు వెళ్ళిపోయారు. కాని మళ్లీ.... యిప్పుడిలా...."

చాలాసేపటిదాకా యిద్దరూ మాట్లాడుకోలేదు. బహుశా ఏమీ మాట్లాడుకోవాలో కూడా యిద్దరికీ తెలిసివుండకపోవచ్చు.

"ఇహ నిద్రపోదాం." అంటూ లేచాడు రామారావు. మంచం మీదకుపోయి పడుకున్నాడు. చాలా నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి.

"అనూరాధా" అని పిలిచాడు మెల్లగా.

"ఏమిటండీ!"

"ఇంకా నిద్రపోలేదా? ఏమీలేదు. మనం చాలా మనస్ఫూర్తిగా మాట్లాడుకున్నాం కాబట్టి ఏమిటో నా హృదయమంతా విప్పి చెప్పాలనిపిస్తోంది. ఒకానొకనాడు నా జీవితం చాలా ఆనందమయంగా గడిచింది. ఉషతో స్వర్గతుల్యంగా రోజులు గడిపాను. కాని అలా ఎక్కువరోజులు గడపకుండానే ఈ దౌర్భాగ్యుడ్ని నాకు వదిలేసి ఉషనన్ను వదిలేవెళ్లిపోయింది.ఆతర్వాత

చాలారోజులు ఎంతభాధ అనుభవించాననుకున్నావు? మాటలతో చెప్పలేను. జీవితంమీద విరక్తి పుట్టింది. ఎంతో పిచ్చిగా తిరిగే వాడ్ని. తర్వాత నువ్వు వచ్చావు. ఉన్నవిషయం చెబుతున్నాను. వెనుకటిజీవితం మళ్లీ అనుభవిస్తున్నానంటే ఒప్పుకోను. కాని నాకు మళ్లీ జీవించటం నేర్పింది నువ్వే. కొన్నికొన్ని అఘూతాలు ఏర్పడినా సుఖాన్ని సంతోషాన్నీ పొందవచ్చని నిరూపించిందినువ్వే. ఇల్లాగే ఎప్పుడూ ,వుండేటట్లు చేయవా? ఇవాళ చెప్పినమాటలు ఎప్పటికీ మరచిపోకుండా వుండవా? నాలోవున్నది బయటకి వెళ్ళగ్రక్కేశాను.అంతే పడుకో. ఇహ నిద్రపో" అంటూ అతను ఒకవైపు తిరిగి పడుకున్నాడు.

.... .... ....

మధ్యాహ్నం రెండుగంటలైంది. అప్పుడే ఒక స్నేహితురాలికి ఉత్తరాన్ని రాసి ముగించి అనూరాధ ఆలోచిస్తూకూచుంది. తను పూర్తిచేసిన ఉత్తరం ఒకసారి చదువుకోవాలని ఆమెకు అనిపించింది.

"లీలా! మనమిద్దరం కలుసుకుని చాలారోజులయింది. ఈమధ్య నీ దగ్గర్నుంచి ఉత్తరాలుకూడా రావటంలేదు. ఆడదానికి చదువుకునే రోజుల్లోనే స్నేహితులూ, స్నేహమూనూ. వెనకటికి మా అక్కయ్యని చూసి "ఎంతసేపూ సంసార గొడవలేనా? ఒక స్నేహితులూ అదీలేకుండా" అని అనుకునేదాన్ని.కాని యిప్పుడు నేనూ మా అక్కయ్యలానే తయారయ్యాను. తప్పనిసరి.
"నువ్వదృష్టవంతురాలవని నేనసూయపడను.హాయిగా ఎమ్.బి. బి. ఎస్., చదువుతున్నావు. మావాళ్లు చదివిస్తే నేనూ చదివే

దాన్నే, నేనూ నీలానే క్లాసులో ప్యాస్‌అయాను. కాని లీలా! నాకు క్లాస్‌రాకుండా వుంటేనే బావుండేది కదూ. నా మనస్సుకి అంత బాధా వుండేదికాదు. నా మార్కులు యింకా ఎవరికైనా వస్తే వాటిని సద్వినియోగ పరుచుకునేవారుకదా.

"నీకింకా పెళ్లి కాలేదు. లీలా! నాకువున్న యీకొద్ది అనుభవాన్ని పురస్కరించుకుని చెబుతున్నాను. మంచి విషయంలోనైనా, చెడు విషయంలోనైనా ఆడదానికి తనమాట నెగ్గించుకోవాలని వుంటుంది; సంసారంలో సాధారణంగా ఆమె సఫలీకృతు రాలవుతూనే వుంటుంది. కాని అలా కాకపోయినప్పుడు ఆమె పడేబాధ వర్ణనాతీతం. ఒక ప్రయత్నంలో విఫలుడైనప్పుడు ఒక పురుషుడు పడేబాధకన్నా అదే పరిస్థితిలోవున్న ఒక స్త్రీ పడేబాధ ఎన్నోరెట్లు ఎక్కువగా వుంటుంది. ఇలా రాస్తున్నానని ఆశ్చర్య పడకేం? ఏదో నేననుకున్నదీ; అనుకుంటున్నదీ- కొంతకాక పోతే కొంతయినా రాయాలనిపించింది; రాశాను.

"అన్నట్లు ఆనందరావు ఏమంటున్నాడు? నీకు తెగఉత్తరాలు రాసేవాడు. పాపం! నీతోపాటు చదువుదామనుకుంటే సీటు రాలేదు. బి. ఎల్, కదూ అతను చదివేది? నా సలహా అడిగితే నిన్ను అతన్నే పెళ్ళి చేసుకోమంటాను. ఇంకేం రాయను? బాగా చదువు. సెలవు" నీ "అనురాధ"

ఉత్తరాన్ని కవరులోపెట్టి అంటించి ఎడ్రస్ రాసింది. ఉబుసుపోకకి ప్రక్కనున్న ఒక నవలతీసి తిరగవేయసాగింది. కాని ఆమె మనస్సు నవలమీద లగ్నంకాలేదు. అలాఅని తను రాసిన ఉత్తరంమీదా లగ్నం అయిలేదు.

లీల! లీల చదువుకుంటోంది. పెద్దచదువు చదువుతోంది. కొన్ని సంవత్సరాలుపోతే ప్రాక్టీస్ పెడుతుంది. ఈ లోగానో తర్వాతో ఆమె పెళ్లిచేసుకుంటుంది. తనకితెలుసు. పెళ్లివద్దనే స్వభావం

గలది కాదు ఆమె. ఒక్క లీలే ఏమిటి? ఏ ఆడదికూడా బుద్ధి పూర్వకంగా "పెళ్లివద్దో" అని అనదు. చేసుకుంటుంది. అప్పుడు వారికి కూడా నేను ఎదుర్కొన్న సమస్యలాంటిదే ఎదురౌతుందా? ఎందుకౌతుంది? లీల రెండోపెళ్లి భర్తను ఎందుకు చేసుకుంటుంది? చేసుకోదు, కాని అంతమాత్రంచేత ఆమెకు ఏ సమస్యలూ లేకుండా ఎలావుంటాయి? భర్త తిరుగు బోతు కావచ్చు. చెడ్డవాడు కావచ్చు. మరీమంచివాడు కావచ్చు. అమెను ఎక్కడికీ కదలనీయకుండా ఎప్పుడూ ఎదురుగుండా వుంటూ అతిగా ప్రేమ ప్రదర్శించేవాడు కావచ్చు. అమాయ కుడు కావచ్చు. తెలివితక్కువవాడు కావచ్చు. ఎక్కువ తెలివి గలవాడూ కావచ్చు. ఇన్నిటిలో ఏదయినా చిక్కేకదా. అతని స్వభావాన్ని అర్థంచేసుకోకుండా అతన్తో సంసారంచేయటం కష్టమైన విషయమే కదా.

ఓవేళ లీలను ఆనందరావే చేసుకోవచ్చు. అప్పుడుకూడా అవస్థే! అతిప్రేమ ప్రదర్శించేవాళ్ళ లెక్కక్రిందకు వస్తాడు ఆనంద రావు. ఇహ అతనికీ దానికీ యిద్దరికీ ప్రాక్టిస్ నిల్.

తన ఊహలకు నవ్వువచ్చింది అనూరాధకు. కాని ఆ ఊహల లోంచి పూర్తిగా బయటపడకముందే ఆమెకుభర్తవిషయం గుర్తువచ్చింది.

ఆయన! ఆయనఏవిషయంలోమంచివాడుకారు? తననిఏవిషయంలో కష్టపెడుతున్నారు? దేంట్లో తననివత్తిడిచేస్తున్నారు? ఎటొచ్చీ ఆయనకూ తనకూ పేచీవచ్చేవిషయమల్లాఒకటే. అదే-బాబుగాడి విషయం. తన పరాజయంతో ఆ పేచీకూడా పరిష్కారమయి పోయింది. తనకి బాధ, అసంతృప్తీమిగిలితే అది వేరే విషయం.

ఎందుకో ఆమెకు జరిగిపోయిన కొన్ని విషయాలు జ్ఞప్తికి తెచ్చుకో బుద్ధయింది.

ఆరోజు బాగా జ్ఞాపకం వుంది. ఆయన తనని చూడటానికి వచ్చినరోజు. తనని ఆయనగారు చూడటం వదిలిపెట్టి ఆయన్నే తను చూడటం మొదలుపెట్టింది. ఏదోబాధ ప్రస్ఫుటమౌతున్న ఆ చూపులు, ప్రశాంతంగావున్న ఆ ముఖం, వేదాంతిలావున్న ఆయనభంగిమ- యివన్నీ తనని ఆకర్షించాయి. వీటన్నిటికీ మించి వారి అం....దం....అందుకే తనురెండోపెళ్ళి అనికూడా చూడకుండా ..."

"మీ అత్తగారున్నారా అమ్మాయి?"

ఆవరించిన ఆలోచనల తాలూకు సిగ్గుతెరలు ముఖమంతాకమ్మి, చెక్కిళ్ళను ఎర్రబరిచి, మనసంతా కితకితలుపెట్టి మేనంతా గగుర్పొడిచి....యింకా యిలాంటి ఏదో అనుభూతుల్లోవున్న అనూరాధకు యీ ప్రశ్న వెంటనే వినిపించలేదు. కాని వెంటనే తెలివి తెచ్చుకుని, చప్పునలేచి నిలుబడి "ఏమిటండీ?" అని అడిగింది.

ఎదురుగా నిలబడివున్న ఎదురింటికాంతమ్మగారు "మీఅత్తగారు ఏంచేస్తున్నారని అడుగుతున్నా" అంది ఝుమాయించి.

"లోపలున్నారండీ" అని జవాబిచ్చింది అనూరాధ సన్నని స్వరంతో.

"సరేలే" అంటూ ఆవిడ విసవిస లోపలకు నడిచిపోయింది.

అనూరాధ మళ్ళీకూర్చుంది.

"కూర్చోవమ్మా" అంది లోపల్నుంచి అత్తగారు, కాంతమ్మ గార్ని ఉద్దేశించి.

"ఏమిటండీ? విశేషాలు?" అంటోంది కాంతమ్మగారు.

కొంతసేపు ఏదో మామూలు విషయాలమీద సంభాషణ సాగి పోయింది.

"కోడలేమంటూంది?" అంది హఠాత్తుగా కాంతమ్మగారు.

"ఏమంటుంది? అందరికోడళ్ళకుమల్లేకాదు మా అనూరాధ. మాయింట్లోజరిగేతతంగంఅంతా మాయింట్లోవుండిపోవల్సిందే. అవన్నీ దాని మనస్సులోయిముడ్చుకోవాల్సిందే. నోరుజారి బయటపడటం నేను వినలేదు?"

"అది సరేలెండి. కాని కొడుక్కి రెండోపెళ్లి చేయటంలో మీ ఉద్దేశం వేరుగా. అది ఎంతవరకు ఫలించినట్లు?"

"అదిమట్టుకూ ఏం స్తుంది? వాడిది రాతిగుండె అయి నప్పుడు?"

"మీరు చాలా వెర్రివారండి లక్ష్మమ్మగారూ?"

"ఏం?"

"మీ కోడలు మంచిదే అనుకోండి. ఎంతమంచి ఆడదయినా తన సవతికొడుకుమీద తండ్రికి అసహ్యం కలిగేటట్లు చేస్తుంది గాని అనురాగం పుట్టేటట్లు చేస్తుందంటారా?"

అత్తగారు కొంచం వూరుకుని "నేన్నమ్మ లేనుకాంతమ్మగారూ. ఈ వృద్ధాప్యంలో అబద్ధం ఎందుకు ఆడాలి? అది అటువంటి అభిప్రాయం కలిగివున్నట్లు నాకేం అనుమానం కలగలా" అంది.

కాంతమ్మగారు ముసిముసి నవ్వులు నవ్వి "అందుకే లోకం మిమ్మల్ని అ[illegible] పకు లంటుంది. భార్యాభర్తలు తల్లిముందు మాట్లాడుకున్న [illegible]జాలా? విడిగా ఏవేంమాట్లాడుకుంటారో, ఏయే తతంగాలు చేస్తా[illegible] మీకేంతెలుసు?" అంది.

"మీకుమట్టుకు ఏంతెలుసు?" అని అడగలేదు లక్ష్మమ్మగారు. ఇలా కొంతసేపు సంభాషణ జరిగాక "వెడతానంది. నే నిలా అంటంలో వేరేఉద్దేశంలేదు. పరిస్థితులు విషమిస్తే మీకే ప్రమాదం. కోడలిమీద ఒక కన్నేసి వుంచమనీ" అంటూ బయటకి వచ్చి అనూరాధని "కులాసాగా వున్నావా అమ్మాయీ?" అని ఒకసారి పలకరించి మరీ వెళ్ళిపోయింది.

ఇందాకట్నుంచీ ఆసంభాషణంతా అనూరాధ వింటూనేవుంది. అప్రయత్నంగా ఆమె నేత్రాలనుంచి అశ్రువులు జలజలమని రాలాయి. ఈ విషయంలో తప్పెవరిదో తనకు తెలీదు. ఆలోచించలేదు. కాని కాంతమ్మగారు అలా అనటంలో, అనుకోకపోవటంలో అర్థంలేకపోలేదు. కాంతమ్మగారికే కాదు తమ కుటుంబవిషయం తెలిసినవారందరికీకూడా అలానే అనిపిస్తుంది. తననిగురించి బయటవాళ్ళు ఏమనుకుంటున్నదీ ఆమెకు తెలియక పోలేదు.

జ్వరంతో వున్న మామగారు లోపలిగదిలోంచి మూలగటం మొదలుపెట్టారు. విషయమేమిటో కనుక్కుందామని ఆమెలేచి వెళ్ళబోయింది.కాని యింతలోనే యిటువైపు గదిలోంచి చంటివాని ఏడుపు వినిపించింది. ఒకక్షణం తటస్థంగా నిలబడిపోయి, తర్వాత కళ్ళుతుడుచుకుని చంటివాడ్ని సముదాయించటానికి వెళ్లిపోయింది అనూరాధ.

.... .... ....

సాయంత్రం రామారావు ఆఫీసునుంచిరాగానే అనూరాధ బాబుకి పాలుపడుతోంది. రామారావుముఖం ప్రక్కకి తిప్పుకుని అటు వైపుచూడకుండా లోపలికి వెళ్ళిపోయాడు. అనూరాధ చప్పున

పాలుపట్టటం ముగించి ప్రక్క గదిలోకిపోయి పిల్లవాణ్ని పడుకో బెట్టి భర్తవద్దకువచ్చింది.

అతను కాఫీ త్రాగుతూ ఆమెవంకచూసి "అలావున్నావేం అనూ?" అని అడిగాడు.

"ఎలా వున్నాను?"

"ఏదో మగతగా కనిపిస్తుంటే...."

"బాగానే వున్నాను" అని ముఖం ప్రక్కకి త్రిప్పుకుంది.

కొన్నిక్షణాలు భారంగా గడిచాక "అనూ" పిలుపు వినిపించిది ఆమెకు——సానునయంగా.

అతని కళ్ళల్లోకి చూస్తూ "ఏమిటండీ?" అని ప్రశ్నించింది.

"ఇవేళ సినిమాకి వెళదామా?"

అతను ఆమెనుంచి దృష్టి మరల్చటల్లేదు. అలానే చూస్తున్నాడు. ఆమె ముఖంలో భావాలు ఏమాత్రం మారకూడదు. అలా ఏమాత్రం జరిగినా అతను పసికట్టి వేయగలుగుతాడు. ఈ విష యం గ్రహించి ఆమెచాలా చిక్కులోవున్నట్లు బాధపడింది.

"అలాగే" అంది ఎంతో కష్టంగా,

"అయితే రెడీ అవు"

లోపలికి వెళిపోయింది; అలావెళ్లిపోవటం ఎంతో యిష్టం అయినట్లుగా. ప్రక్కగదిలోంచి ముసలాయన మూలుగుతున్నాడు. అవతల బాబు నిద్రపోతున్న విషయం గుర్తువచ్చింది. వాడు ఏక్షణంలోనైనా లేచి ఏడుపు లంకించుకోవచ్చు. అక్కడే నిల బడి ఒకక్షణంసేపు ఆలోచించింది. ఏమయినాసరే అయనతో సినిమాకి వెళ్ళవల్సిందే. ఎన్ని ప్రతిబంధకాలువచ్చినా మాన కూడదు. అందులో యివాళ....యీరోజు....యీరోజు వాతా వరణం. ఆయనలా అడగటం అన్నీప్రత్యేకంగా కనిపించాయి. తను నిరాకరించలేదు.

ఆమె వెళ్ళు ముఖం రుద్దుకుని వస్తూంటే అత్తగారు గ్రహించి నట్లుంది—"ఎక్కడికి?" అనడగింది.

అనూరాధ తల వొంచుకుని "సినిమాకత్తయ్యా" అంది

ఆవిడ తల ప్రక్కకి తిప్పుకుని "ఊఁ" అంది. అలా అనటంలో అనూరాధకి ఎన్నో ధ్వనులు, ఎన్నో అర్థాలు స్ఫురించాయి. అక్కడ ఎక్కువసేపు నిలబడలేక భర్తవున్న గదిలోకి వచ్చింది.

పరీక్షల నేవి మొగవాళ్ళకంటే ఆడవాళ్ళకే ఎక్కువ తటస్థపడ తాయి. అందులోనూ విచిత్రం ఏమిటంటే "యీపని యిప్పుడు జరగకపోతేబాగుండును" అనిఎప్పుడైతేఅనుకుంటారో అప్పుడే ఆపని జరిగితీరుతుంది. ఇది సత్యంకాదు. నగ్నసత్యం. ఇది నిబంధనకాదు. మామూలు విషయం.

ఇంకో పావుగంటలో బయటకి వెళతారనగా బాబు లేచి ఏడవ సాగాడు. ఈ యింట్లో ఆ పసివాడికి బాగా పరిచితమైన ముఖాలు రెండే. ఒకటి అనూరాధ. రెండవది ముసలామె, రెండో ఆమెను చూస్తే ఆ పసి హృదయానికి భయం. మొదటి ఆమెను చూస్తే అమ్మలాంటి అనురాగం.

అనూరాధ చాలా కష్టంమీద నిగ్రహించుకోగలిగింది. మనస్సు వాడివైపు ఎంతలాగుతున్నా భర్తముఖంలోని భావపరంపరను చూస్తూ ఆమె మాట్లాడలేక పోయింది.

వాడు గుక్క తిప్పుకోకుండా ఏడుస్తున్నాడు.

రామారావుముఖం ధుమధుమలాడిపోతోంది.

ముసలామె అంతూ పొంతూ లేకుండా గొణుక్కుంటోంది. అనూరాధ, చాలా యిరుకులోవున్న అనూరాధ ఒకటిరెండు క్షణాలుబయటకుతెలియకుండామధనపడిభర్తగారికళ్ళలోకిచూస్తూ "పదండి" అంది. అతను బయటకు నడిచాడు. ఆమె మెల్లగా అనుసరించింది.

కాని ఆమెలో ఆరాత్రి చాలా భయంకరమైన తుఫాను చెల రేగింది. విచారానికీ, విషాదానికీ, ఏడుపుకీ-అవతలనున్న అవస్థ ఆమె అనుభవించింది.

భర్త ప్రక్కన కూర్చుంది. కాని వంటరిగావున్నట్లే బాధపడింది. సినిమాలో కూర్చుంది. సినిమా చూస్తున్నట్లు ఆమె అనుకోలేదు. ఏమనుకున్నాడో ఏమిటో అతనుకూడా ఆమెను ఏవేవో ప్రశ్న లడిగి యిబ్బంది పెట్టలేదు.

పదిన్నర అయాక, వీధులన్నీ చాలావరకూ నిర్మానుష్యం అయి పోయాక యిద్దరూ యింటికివచ్చారు. ముసలామె వచ్చి తలుపు తీసింది. అంతవరకూ మూలిగి మూలిగి ముసలాయన అప్పుడే పడుకున్నట్లున్నాడు. రామారావు కాళ్లు కడుక్కునేందుకు లోప లికిపోయినప్పుడు అనూరాధ బాబుదగ్గరకుపోయి చూసింది. మంచినిద్రలో వున్నాడు. బాగా ఏడిచినట్లున్నాడు. చెంపలమీద, నాజూకైన ఆ చెంపలమీద కన్నీటిచారలు సన్ననిదీపం వెల్తురులోకూడా స్పష్టంగాకనిపిస్తున్నాయి. అప్రయత్నంగా చేతులు ముందుకుజాచింది. ఆమె సున్నితమైనచేతులు పసివాడి లేత చెంపల్ని మృదువుగా స్పృశించాయి.

భోజనాలైపోయి అతనువెళ్లిపడుకున్నాక ఆమె అత్తగార్ని రహ శ్యంగా అడిగింది.

"బాగా ఏడిచాడా అత్తయ్యా?"

దీనికి అత్తగారు "ఊహుం. లేదు" అని కటువుగా సమాధానం చెప్పి అక్కడ్నుంచి విసురుగా వెళ్లిపోయింది.

"అందుకే ఊరంతా అట్లా అనుకుంటూంది."

చాలా కీచుగా యీ మాటలు అనూరాధకి వినిపించాయి. నిరాశగా అక్కడినుంచి కదిలి తనుకూడా వెళ్ళిపడుకుంది. అతను....

రామారావు నిద్రపోతున్నాడో లేదో ఆమెకు తెలియదు. తెలుసు కోవాలని ప్రయత్నించనూ లేదు.

ఒకదానితర్వాత ఒకటి,ఒకదానిపైనఒకటి ఆలోచనలు తరంగాల్లా ఆమెను ఆక్రమించి, గుక్కతిప్పుకోకుండా యాతన పెడు తూంటే చిమ్మచీకటిలో కాంతికిరణంలా కాకుండా, మహా వెలుగులో చీకటిఛాయలా ఒకప్రశ్న ఉదయించింది.కాదు ఒక సందేహం కలిగింది.

"బాబుగాడు ఎదిగినతర్వాత?"

బాబుగాడు కొంచం వయసొచ్చి, కాస్తజ్ఞానం సంపాదించాక పర్యవసానం ఎలావుంటుంది?

తండ్రికి వాడంటే యిష్టంలేదనివాడికి తెలుస్తుంది. వాడివంక చూడటంకూడా ఆయనకు అసహ్యమని తెలుస్తుంది. అప్పుడు! వాడిమనస్సు బాధతో ఎంతకుమిలిపోతుంది? సంతోషం అనేది వాడికిఎక్కడ?

తనదగ్గరకువచ్చి "అమ్మా! అమ్మా! నాన్నారు నాతో ఎందుకు మాట్లాడరు? నా వంక ఎందుకు చూడరు? నేనంటే నాన్నారి కెందుకమ్మా అంత అసహ్యం?"అని జాలిగా, దీనంగా, బాధగా అడుగుతాడు.

అప్పుడు వాడికి, ఆ పిచ్చితండ్రికి, ఆ చిన్నారికి తను ఏమని సమాధానం చెబుతుంది?

మహా వెలుగులో చీకటిఛాయలా ఉదయించిన యీ ప్రశ్నకు ఎంత ఆలోచించినా ఆమెకు ఆరాత్రి.... ఏ రాత్రీ సమాధానం దొరకలేదు.

.... .... ....

చాలారోజులతర్వాత ఒకరోజు - తెల్లవారింది. అనూరాధ నిద్ర నుంచి లేచి కూర్చుంది. ఒకసారి బద్ధకంగా వళ్ళువిరుచుకుని, కళ్లునులుముకుని నిలబడింది. ఏదోమగతగావుంది ఆమెకు. తీయని మగత.

తలుపులు తీసి బయటకు వెడదామని రెండు అడుగులువేసింది. కానిహఠాత్తుగా తలత్రిప్పి, ఏదో కనిపించేసరికి చటాలున ఆగి పోయింది. ఆమె ముఖం, చెక్కిళ్లు సిగ్గుతో ఎర్రబారాయి. ఎంత వద్దనుకున్నా, సిగ్గుపడుతున్నా, బలవంతంగా తనవంక తాను నఖశిఖ పర్యంతం పరిశీలనగా చూసుకుంది- నిలువుటద్దంలో. చూస్తూ చూస్తూండగా ఆమె చురుకైన పెదాలు మెల్లిగా కది లాయి. ముసిముసిగా నవ్వుకుంది.

అలా ఎక్కువసేపు గడిచిపోకముందే ఆమెకు ఏదో తోచి, చప్పున వెనక్కి తిరిగింది. అనుకున్నంతా అయింది. రామా రావు భార్యవంక ముగ్ధుడై చూస్తున్నాడు; యిందాక అనూరాధ తనని తాను చూసుకున్న చూపు.

ఇలా అమాంతంగా వెనక్కితిరిగి ఉలుక్కుపడేసరికి అతను పకపకమని నవ్వేశాడు.

మరీసిగ్గుతో ఆమె తలవంచుకొని "పోండి" అంది.

"ఇలారా" అన్నాడతను.

అలానే దగ్గరకుపోయి యింకా తలవంచుకునే నిల్చుంది ఆమె. "లేత" సూర్యుడి కిరణాలు కిటికీ తలుపులు సందులగుండా చోటు చేసుకునివచ్చి ఆమె ఫాలభాగంమీద చురుక్కుమని మెరి శాయి.

ఆమె..........భార్య వూహించుకున్నట్లే అతను......... తన ఎడమచేయి ఆమెనడుముచుట్టూ పోనిచ్చి, దగ్గరగా, హృద

యానికి దగ్గరగా తీసుకుని, కుడిచేత్తో ఆమె చుబుకాన్ని సున్నితంగా పట్టుకుని పైకెత్తి, తనచూపులు అమె చూపుల్తో కలుపుతూ "ఏమిటి సంగతి?" అన్నాడు చాలా అద్భుతంగా.

ఇంకా సిగ్గుపడి క్రిందకి దించేసుకుంది.

"ఊహుఁ"అని తనపట్టు విడవకుండా "చెప్పాలిసిందే" అన్నాడతను.

మెల్లగా 'సోగకన్నులు' పైకి ఎత్తి అతనివంక ప్రశ్నార్థకంగా చూసింది.

"చెప్పవా?" అతను బ్రతిమలాడే ధోరణిలో అన్నాడు.

అణుచుకోలేక, అణుచుకోలేక ఒక్కసారిగా పైకి కిలకిలా నవ్వేసింది.

"చెప్ప వుకదూ?" యింకా బ్రతిమిలాడుతూనే అన్నాడతను.

"ఉహుఁ" అని నవ్వుతూ వదిలించుకుని పారిపోబోయి విఫలురాలయింది.

"చెప్పందే వదలను" యీసారి బెదిరించాడు.

'అంతేనా?' అని మనసులో అనుకుని దీనంగా ముఖం పెట్టింది.

'అంతే' అన్నట్లుగా అతను భంగిమ మార్చాడు.

'లేకపోతే?' అన్నట్లుగా అతనివంకచూసింది.

'ఇంతే' అన్నట్లుగా తన దృఢ నిశ్చయాన్ని వెల్లడిచేశాడు, ఆమెను పట్టువదలకుండా.

'అయితే చెప్పాలిసిందేనా?' అనుకుని సిగ్గుతో అతనినుంచి దృక్కులు మార్చింది.

'తప్పక చెప్పాలి' అని లోలోపల అనుకుని బయటకి "చెప్పక తప్పదు" అన్నాడు.

ఎలాచెప్పనా అని ఆమె సంశయిస్తోంది.

కాని మళ్ళీ ఏదోతోచి "రహశ్యం" అంది బయటకు.

"సరే"

ఆమె ఎలాగో అతని ముఖంమీదకువంగి చెవిలో చాలా రహశ్యంగా ఏదోచెప్పింది. తరువాత యిహ అక్కడ వుండలేక బలవంతంగా పట్టువిడిపించుకుని తలుపులుతీసి బయటకి వెళ్ళిపోయింది పారిపోతున్నట్లుగా.

రామారావు నేత్రాలు సంతోషంతో ఒక్కసారిగా విస్ఫారితాలయాయి. ఏదో తీయనివూహ అతని శరీరాన్ని సహితం కదిలించింది. కాని అతనాదశలో ఎక్కువసేపు వుండలేదు. చూస్తూ వుండగానే అతనిముఖం ముడుచుకుపోయింది. కళ్ళలో ప్రవేసించిన వింతకాంతి తొలిగిపోయింది. ఏదో భయంకర పరిణామాన్ని చూడబోతున్న వ్యక్తిలాగా గజగజమని వణికిపోయాడు.

మళ్లీ ఏంజరుగుతోంది?

అతని తల వెనక్కి తిరుగుతోంది.

ఏంజరిగింది? తను జీవితంలో మరిచిపోలేని ఆభయంకరమైన రోజున ఏం జరిగింది?

ఆరోజు ఎంత చీకటిగా వుంది? తననుంచి యిప్పటికికూడా పూర్తిగా తొలగిపోని చీకటి.

వెనక జరిగిపోయినవన్నీ యిప్పుడు జరుగుతున్నట్లే కనబడుతున్నాయి. భయంకరమైన ఆరాత్రి తను ముందుగదిలో తడబడే గుండెతో తిరగటం, మాటిమాటికీ ఆగిపోతూ ఏవయినా శబ్దాలు

వినిపిస్తాయేమోనని చెవులురిక్కించి వినటం, అక్కడ ఎక్కువ సేపు వుండలేక సావిట్లోకివస్తే తండ్రి అక్కడ నిలబడి ఎటో శూన్యంలోకిచూస్తూవుండి తన అలికిడి విని యిటువైపు తిరిగి చూస్తే ఆచూపు భరించలేక మళ్లీ లోపలికివస్తే....తలుపులు వేసి వున్న ఆగదిలోంచి ఉష బాధాకరమైన అరుపులూ; తల్లి రామ రామ అనే ధ్వనులు; లేడీడాక్టర్ లోపలచేసేహడావుడి; తండ్రి తనప్రక్కకివచ్చి కంగారుపడుతూ చూస్తూవుండటం; తను అంతకన్నాదీనమైనపరిస్థితిలోవుండగానే దఢాలునతలుపులుతెరచు కోవటం;తెరుచుకుని తెరుచుకోకముందే పులిలాదూకి ఉష పడు కున్న మంచందగ్గరకు పోయేసరికి, శవంలావున్న ఉష ప్రక్కనే తల్లి ఏడ్పులూ, యిటుప్రక్క ఆ వెధవ, దరిద్రుడు, దౌర్భాగ్యుడు - వాడి ఏడుపు."ఉషా" అని పెద్దఏడుపుతో ఆమెమీద వాలిపోబోతుంటే తండ్రిబలమైన చెయ్యితననిగట్టిగాపట్టుకుని బయటకు లాక్కునివెడుతోంటే.... "అబ్బా", అనుకున్నాడు రామారావు బాధగా.

అతని ఆలోచనలు యింకా కొనసాగాయి. ఆతర్వాత ఏం జరి గింది? ఉషస్థానంలో అనూరాధకు ఎలా చోటివ్వగలిగాడు? అనూరాధనుచేసుకోకముందు తల్లి తనను ఎన్నివిధాల బ్రతిమిలా డింది?తండ్రిచూపుల్తో ఎంతకల్లోలపరిచాడు.ఉషపోయినదగ్గర్నుంచి తనుజీవచ్ఛవంలా,కొడుకుమాట వింటేనే అసహ్యపడుతూ ఎన్ని రోజులు గడిపాడు? ఆరోజుల్లో తను ఆలోచనలు ఎంతవెర్రిగా సాగాయి? తన ప్రవర్తనకి విసిగిపోయి తల్లి ఎన్ని దుర్భాష లాడింది?తను ఎంతో తీవ్రంగా ఆలోచిస్తూ ఏదో గుర్తు వచ్చే సరికల్లా అమాంతంగా లేచి నిలబడి క్రోధంతో పిడికిలి బిగించి "వాడిని....ఆ వెధవని చంపేస్తాను" అని అనటం....అదంతా ఏమిటి?

కాని యిప్పుడదంతా చాలావరకూ మరిచిపోయాడు; అనూరాధ వల్ల.

అనూరాధవల్లే యిప్పుడు మళ్ళీ అదంతా గుర్తువస్తోంది. ఉష తన్ను వదిలి వెళ్ళిపోయిననాటిరాత్రి మళ్లీ మళ్లీ జ్ఞాపకంవచ్చి కలవర పెడుతోంది.

ఎదురుగాబల్లమీదనుంచి ఉష తనవంక చిరునవ్వుతో చూస్తోంది. దగ్గరకు వెళ్ళాడు.వణుకుతున్న చేతుల్తో ఉష ఫొటోను అందుకో బోయాడు. కాని అతని హృదయంలో ఏదో సుదర్శనం గిర గిర తిరిగినట్లయింది. చేతులు గబుక్కున వెనక్కి తీసుకుని గుమ్మంలోకి విసవిస నడిచి బయటకు వెళ్ళిపోయాడు.

.... .... ....

నిమ్మదిగా రోజులు గడుస్తున్నాయి. ఈమధ్య అనూరాధకు ఆ యింట్లో అంతా విచిత్రంగా కనబడసాగింది. ఆయన తనని తప్పుకుని ఎందుకు తిరుగుతున్నారు? అప్పుడప్పుడు ఎందుకు తనవంక అలా దీనంగా చూస్తారు?

అత్తగారూ అంతే. తను కాపరానికి వచ్చినతర్వాత చాలా కొద్ది రోజుల్లోనే ఆవిడగారి స్వభావాన్ని బాగాఅర్థంచేసుకుంది. ఎవ రెవరో చెప్పినమాటలవల్ల తాత్కాలికంగా ఉద్రేకపడినా తనంటే ఆమె ఎల్లప్పుడూ ఏవగించుకోలేదు. తనను ప్రేమగా చూడకుండా వుండనూలేదు.

వంటరిగా ఆమె కూర్చుని దేనికోసం బాధపడుతుందో తనకి తెలుసు కొడుకంటే ప్రేమలేని కొడుకుకోసం యీతల్లివేదన పడుతోంది. ఇలా ఎంతకాలం....ఎన్నిసంవత్సరాలు గడిచి పోతుందోనని భయపడుతోంది.

"ఏవమ్మా వంట్లో బావుంటూందా?" అనేది అప్పుడప్పుడూ. తల ఊపేది తను.

మళ్లీ బాబుగాడ్ని సముదాయించలేక తను మహా యిదయి పోతుంటే "ఏమిటో ఆమాత్రం సముదాయించటం చేతకాదు" అని విసుక్కునేది.

ఆవిడి తనని గారాబం చేసినా మురిసిపోలేదు. విసుక్కున్నా కోపంతెచ్చుకోలేదు.

నిలువుటద్దంలో తన ప్రతిబింబం చూసుకుని చాలా నూతనంగా కనబడేసరికి సిగ్గుపడి "లీల కీ విషయం ఎట్లా రాయనా?" అని తెగ ఆలోచించేది అనూరాధ.

చివరికి ఎట్లాగో రాసేసింది.

దానికి లీల రాసిన జవాబు చూసి చాలా సిగ్గుపడింది. "ఇంకో మూడేళ్ళు ఆగకపోయావా? నా చేతుల్తో...."

"ఫో" అనుకుంది అనూరాధ.

.... .... ....

ఒకరోజు....రాత్రి పన్నెండు గంటలైంది. రామారావు గదిలో నిల్చుని అటూ యిటూ తిరుగుతున్నాడు.

బాగా చీకటిగావుంది. దీపాలున్నచోట్ల మినహాయిస్తే మిగిలిన దంతా చీకటే. అమావాశ్య చీకటి. రామారావు చీకటిగావున్న ప్రదేశంలో నిల్చోలేదు. ఎలక్ట్రిక్ లైట్ కాంతితో నిండివున్న గదిలో అటూయిటూ పచార్లు చేస్తున్నాడు. అతను వెల్తుర్లోనే ఉన్నాడు. వెల్తురులోనే తిరుగుతున్నాడు.కాని చీకట్లోవున్నట్లే,

చీకట్లోతిరుగుతున్నట్లే ఫీలవుతున్నాడు. అతనికిమాత్రంవెల్తురుగా లేదు అంతరంగికంగా.

అతను ప్రతి నిమిషానికీ టైమ్ చూసుకుంటున్నాడు. తలుపులు వేసివున్న ప్రక్కగదిగుమ్మందగ్గరకు వెళ్ళి ధ్యాస వుంచి ఏదో వింటున్నాడు.

మళ్లీ ఈరోజువచ్చింది. రామారావుదృష్టిలో భయంకరమైన ఈరాత్రి మళ్లీవచ్చింది. గదిలోపల ఏం జరుగుతుందో అతనికి తెలియదు. చూద్దామంటే తలుపులువేసివున్నాయి, విందామంటే ఏమీ వినబడటంలేదు. తను యీ బాధపడలేడు. అనూరాధ అడినగిట్లు అత్తవారింటికి పంపేస్తేనే బావుండేదేమో.

అతనికి చిరు చెమటలు పోస్తున్నాయి. అతని నుదుటిమీదనుంచి స్వేదబిందువులు చెంపలమీదుగా ప్రవహిస్తున్నాయి. కన్నీళ్ళకీ, ఆ నీళ్ళకీ ఎక్కువభేదంలేదు.

ఉన్నట్లుండి లోపల్నుంచి ఏదో మూలుగు. బాధతో ఒక స్త్రీ చేస్తున్న ఆర్తనాదం వినిపించింది. దడదడలాడే గుండెతో, తడబడేకాళ్ళతో ఒకచోట నిలబడి జాగ్రత్తగా విన్నాడు. అతనికి స్పష్టంగా తెలిసింది. అనూరాధ రోదిస్తోంది. ఒకనాడు ఉష కూడా యిలాగే....

రామారావు అక్కడో క్షణం నిలబడలేకపోయాడు. అక్కడ వుండటం కష్టమైంది. ఇవతలకి వచ్చి వాకిట్లోకి చూశాడు. తండ్రి, వృద్ధుడైన తండ్రి ఏనాడో ఒకనాడుచూసినట్లుగాఆకాశం లోకి చూస్తున్నాడు.

రామారావుఅక్కడో క్షణంనిలబడిఆలోచించాడు: ఈక్షణంలో అతనికి ప్రపంచమంతాబాధపడుతున్నట్లుగాఅనిపిస్తోంది. ఈగదిలో... చాలాఅధమస్థితిలోతనుబాధపడుతున్నాడు. బయటతండ్రిబాధపడు

తున్నాడు. లోపల అనూరాధదగ్గర నిలబడి అమ్మకూడా తను కంటే ఎక్కువగా బాధపడుతూండాలి. లేడీడాక్టర్ బాధ సరేసరి. హాస్పిటల్ కాక యింటికి రమ్మన్నందుకే ఆవిడ బాధపడింది. ఇహ అనూరాధ! ఉన్నబాధంతా ఆమెదే. ఆమెగురించే యింత మంది.

అక్కడకూడా ఎక్కువసేపు వుండబుద్ధిపుట్టలేదు. తండ్రివైపు చూడకమునుపే మళ్లీ రెండడుగులు లోపలకు వేశాడు.

లోపలకు సరిగ్గా వచ్చీరాకముందే స్థంభీభూతుడై నిలబడి పోయాడు. పసివాడి ఏడుపు స్పష్టంగా వినిపిస్తోంది.

అతని పెదాలమీద దరహాసం వెల్లివిరిసింది. సంతోషంతో వళ్లు పులకరించింది. ఎవరిది ఆ ఏడుపు? ఈ నిమిషంలో భూమి మీద పడిన....

కాదు. అతను తనపొరపాటు తెలుసుకున్నాడు. లోపల ఎక్కడ్నుంచో బాబుగాడు ఏడుస్తున్నాడు. ఏడిచేది వాడు. ఆ దౌర్భాగ్యుడు. ఉషని తననుంచి వేరుచేసిన ఆ దుర్మార్గుడు.

ఇటువంటి ఆపత్సమయంలోకూడా వీడు తనని ఏడిపిస్తున్నాడు. తనమీద పగ సాధిస్తున్నాడు.

వినలేక రెండుచేతుల్తో గట్టిగా చెవులు మూసుకున్నాడు. అలా ఎక్కువసేపు వుండకముందే చప్పున తనముందు వున్న తలుపులు తెరచుకున్నాయి. నర్సు తల బయటకు పెట్టి ఒకసారి రామారావు వంక దీనంగా చూసింది.

"ఏం జరిగింది నర్స్?" ఆదుర్దాగా అడిగాడు.

నర్సు జవాబు చెప్పలేదు. మళ్లీ తలుపులు మూసేసుకుంది. ఈ సారి లోపల్నుంచి స్పష్టంగా ఏదో గందరగోళం జరుగుతున్నట్లు వినిపిస్తోంది. అప్పుడప్పుడూ అమ్మగొంతుకూడా వినిపిస్తోంది.

ఎందుకో ప్రక్కకి తల త్రిప్పిచూసేసరికి అక్కడ తండ్రి నిల బడివున్నాడు. తనవంక చూడటంలేదు. కళ్ళుమూసుకుని నిశ్చలంగా వున్నాడు.

"నాన్నా!" అన్నాడు రామారావు కంపితస్వరంతో.

తండ్రి పలుకలేదు. బహుశా గంభీరంగా వుండటం పెద్దవాళ్ళకే చేతనవును.

అతనింకా ఏదో ఆలోచించుకోకముందే గదిలో గోల మరీ ఎక్కువైంది. రామారావు యిహ ఉద్వేగం అణుచుకోలేక పోయాడు. ఒక్కదూకులో అనూరాధ సమక్షంలోకి పోయి పడాలని భావించాడు. కాని తలుపులు....తలుపులు ...చప్పున తెరచుకున్నాయి. ఇంతకుముందు అనుకున్నట్లే రామారావు ఒక్కదూకులో భార్య సమక్షంలోకి పోయాడు. వేరే ఎవరు ఏమి చేస్తున్నదీ అతను గమనించలేదు. సరాసరిపోయి ఆమెను తాకుతూ కూర్చున్నాడు. అతని కళ్ళలోంచి నీళ్ళు జలజలమని రాల్తున్నాయి.

అనూరాధ కళ్ళుమూసుకుని నిశ్చింతగా, నిర్మలంగా పడుకుని వుంది. రామారావు స్మృతిపథంలో ఏదో మెరిసింది. ఒకానొక రోజు ఉషకూడా యిలాగే....

"అనూ!" అన్నాడు భయంగా.

అనూరాధ నిమ్మదిగా కళ్ళు విప్పింది–రామారావు ఆశ్చర్యంగా ఆమెవంక చూస్తున్నాడు. అతనిఆశ్చర్యం ఇంకా సంభ్రమంలోకి మారలేదు.

"అనూ" అన్నాడు మళ్ళీ.

అనూరాధ అతనివంక అలాగే చూసి, మెల్లగా నవ్వింది; నీర సంగా.

"నువ్వు....నువ్వు బ్రతికావా అనూ!"రామారావుమాటలు తడబడ సాగాయి.

అనూరాధ చురుకైన పెదాలమీద అవతరించినచిరునవ్వు మాయ మైంది. కష్టంగా, దీనంగా, బాధగా, ప్రక్కకి చూసింది అతి ప్రయత్నంమీద.

ఆమె ఎటువైపుచూస్తుందో గ్రహించి రామారావుకూడా అటే చూశాడు. అతని కళ్ళు తిరిగాయి. కొన్ని నిమిషాలయినా వయసులేని చిట్టిపాపాయి, భయంకరమైన చావుకి ఆహుతై వికృతంగా పడివున్నాడు.

"అబ్బా" అని అతను భయంతో కళ్లు మూసుకున్నాడు.

కాని ఒకటి రెండుక్షణాలైనా గడవకముందే ఏదో స్ఫురించి కళ్లు తెరిచిన రామారావు ముఖం వికృతంగా, మరీ వికృతంగా మారి పోయింది.

అనూరాధ వంక సూటిగా చూశాడు.తనవంక దీనంగా చూస్తోంది. భయంలేకుండా చిట్టిపాపాయి వంక చూశాడు. తనవంక చూడట ల్లేదు, మళ్ళీ ఉషవైపు.........కాదు అనూరాధవైపు చూశాడు. చలనరహితంగా తనవంక చూస్తోంది.

చప్పున బాబుగాడివంక....ఊహూ చిట్టిపాపాయివంక చూశాడు. చనిపోయి, పడివున్నాడు.

వెర్రివాడిలా అలా యిద్దరివంకా చూస్తూవుండగానే అతనిలో అచంచలమైన భావతరంగాలు చెలరేగి ఊపిరాడనీయకుండా చేశాయి. చివరికి ఆ భావతరంగాలు ఒకపరిధిని చెరుకునేసరికి ఝల్లుమని అతని శరీరంమీదా, మనసుమీదాకూడా ఎవరో అజ్ఞాత వ్యక్తి చరిచినట్లయింది.

ఏకధారగా అతనికళ్ళనుండి నీరు స్రవిస్తుండగా లేచి నిలబడి, అనూరాధవంక చూశాడు.

ఆమె పెదాలు, అతికష్టంమీద కదులుతున్నాయి. ఏదో అనాలని ప్రయత్నిస్తోంది.

"బా....బా.... బు"

అతను యింక వినిపించుకోలేదు. "బాబూ" అని కెవ్వున అరిచి రివ్వుమని అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు. అక్కడున్న వాళ్ళందర్నీ యీ ప్రవర్తన చకితుల్ని చేసి, వాళ్ళింకా చకితులై అలా వుండగానే రామారావు బాబుగాడ్ని ఎత్తుకుని, ముద్దులవర్షం కురిపిస్తూ లోపలికి వచ్చి, మళ్ళీ సరాసరి అనూరాధదగ్గరకు వచ్చి కూర్చున్నాడు.

ఈ దృశ్యం చూస్తున్న అనూరాధ కళ్ళలో ఆనందం మెరిసిపోయింది.

"నువ్వే జయించావు అనూ. పరాజయం నాదే" అన్నాడు రామారావు హాయిగా.

వెనుకనుంచి రెండుముసలి హృదయాలలో సంతోషం వికసించింది. కాని అనూరాధ మెరిసిపోయిన కళ్లు, ఆమె పెదాలమీద చిరునవ్వు - అదంతా క్షణంలో మాయమయిపోయింది. చూస్తూవుండగానే ఆమెముఖం నల్లబడిపోయింది.

"జయం నాదా?" ఆమె ప్రశ్నించుకుంది.

ఏంచేసింది? తను ఏం చేయగలిగింది? ఈ ఘనత తనదిమాత్రం కాదు.

ఆమె దీర్ఘంగా నిట్టూర్చింది. అతికష్టంమీద పెదాలువిప్పి "కాదు. పరాజయం నాదే...." అంది.